అగ్నికి ఆజ్యం తోడైతే భగ భగ మండటం ఎంత సహజమో ఒకే విషయాన్ని పదుగురు నొక్కి చెప్తూ ఉంటే అందులో సత్యం ఉందని భ్రమించటమూ అంతే సహజం. పార్వతి అందుకు అతీతురాలు కాదు. ఆమెలో పదహారేళ్ళుగా పాతుకుపోయిన ఆదర్శాలు, నమ్మకాలు పేకమేడల్లా కూలిపోయాయి. ఆమెలో చెప్పలేని నిర్వేదం, తీరని అశాంతి చోటు చేసుకున్నాయి. ఆమెలో ఓర్పు నశించింది.

రామం రాకకోసం ఆమె గుమ్మం పక్క నిలబడి నిరీక్షించ సాగింది. కాంతమ్మ మాటలు ఆమె చెవుల్లో మార్మోగు తున్నాయి.

“పార్వతీ! నీకు తెలుసునో తెలియదో కాని, రామం ఇప్పుడు నీ చెప్పుచేతల్లో లేడు. వాడు ఎవత్తెనో వెంట వేసుకుని తిరుగుతున్నాడట. మా వారికి వాళ్ళిద్దరూ అనేక పర్యాయాలు హోటళ్ళలోనూ, సినిమాలలోనూ కనుపించారట” అంది కాంతమ్మ.

పార్వతి కొడుకులో పెద్ద తప్పు కనుపించలేదు. “వాడికేం తెలియదా? నా పెంపకంలో పెరిగిన వాడు పెడత్రోవ ఎంత మాత్రం పట్టడు. స్నేహితు రాలితో తిరిగినంత మాత్రాన తల్లి దండ్రులను ఎదిరించే శక్తి వాడిలో ఉండదు.” ఇదే అంది ఆమెతో.

“ఎంత వెర్రిబాగుల దానివి, పార్వతీ! ఎంతైనా వాడు నీ కన్నబిడ్డడా? వాడికి నీ పట్ల ఆదరాభిమానాలు ఉంటా యని అపోహ పడుతున్నావు. చేతులు కాలిపోయిన తరవాత ఆకులు పట్టుకొని లాభం ఉండదు. వాడి కో ముక్కుతాడు ఎంత త్వరగా వేస్తే అంత మంచిది. నీ సుఖాన్నికూడా చూసుకోకుండా వాణ్ణి పెంచి పెద్ద చేశావు. వాడంతా వట్టి అపోహ అయితే, నా కెంతో సంతోషం. ఏది ఏమైనా తెలిసినదానివి, కావలసినదానివి కాబట్టే ఇంతగా చెప్పు డం. నా మాటల్లో తప్పు పట్టుకోకు” అంది కాంతమ్మ.

కాంతమ్మ మాటలే ఆమెలో మాటి మాటికీ ప్రతిధ్వనిస్తున్నాయి.

‘వాడు నా కొడుకు కాడా? కన్నంత మాత్రాన వాడికి నేను తల్లిని కానా? పదహారేళ్ళు కళ్ళలో పెట్టుకు పెంచానే— ఇప్పుడు రెక్కలు రాగానే మమ్మల్ని వదిలేసి వెళ్ళిపోతాడా వాడి దారిని వాడు? ఈ నాడే ఈ సంగతి పరిపూర్ణంగా పరిష్కరించుకోవాలి.’ ఇదే ఆమెలో తపన.

రామం రానే వచ్చాడు.

“ఎక్కడెక్కడ తిరుగుతున్నావురా ఇంత సేపూ? ఆఫీసు అయిదు గంటలకే వదిలేసినా రాత్రి పదిగంటలకా రావడం? రోజు రోజుకీ నీ తిరుగుళ్ళు ఎక్కువై పోతున్నాయి.” వాడిని వీధి లోనే నిలేసింది.

ఇరవై రెండేళ్ళ రామం మాట్లాడ కుండా తల వంచుకొని ఇంటిలోనికి వెళ్ళిపోయాడు.

“ఏంరా, నే నంటే నీకు ఖాతరు లేదా? అడిగిన దానికి సమాధానం చెప్పాలన్న పరిజ్ఞానం లేదా? నీ చదువెందుకు— తగలెయ్యనా?”

రామం కొంచెం ఆశ్చర్యపోయాడు. తల్లి తన్ను వీధిలోనే నిలదీసి ఎందు కింతలా ప్రశ్నిస్తున్నాదో అర్థం కాలేదు వాడికి.

“ఏమీ లేదమ్మా. స్నేహితులతో పార్కుకి వెళ్ళాను. లేటయిపోయింది. మరేంలేదు.” రామం మెల్లిగా సమాధానం చెప్పాడు.

“స్నేహితులతోనా, స్నేహితురాలి తోనా? ఒరే, రామం! వెనుకటి కో పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగుతూ ఎవరూ చూడటం లేదనుకుందట. నీవు ఎవతెతో ఎలా తిరుగుతున్నావో లోకులు చూడటం లేదనుకోకు. మమ్మల్ని మభ్యపెట్టా లనుకోవటం ఉత్త పొర పాటు.”

“అమ్మా! నేను సరళతో తిరగడం లేదని అనటం లేదు. ఆమె మా ఆఫీసులో పని చేస్తోంది. అప్పుడప్పుడు సరదాగా పార్కుకి, సినిమాకి వెళ్ళడం నిజమే. ఇందులో తప్పు పట్టవలసిన దేమీలేదు. నే నేం కాని పని చెయ్యటం లేదే?”

“ఒరే! పెళ్ళికాని వాడివి ఒక ఆడ పిల్లతో తిరగటం తప్పు కాదని సమర్థించు కుంటావా? లోకం ఏమనుకుంటుంది? ఏదైనా బలహీనపు ఘడియలో అను కోనిది జరుగుతే ఆ పిల్ల గతేం కాను? ఇక తల్లిదండ్రులమైన మా పరిస్థితి ఎలా ఉంటుందో కొంచెం ఊహించావా?”

రామం జవాబు చెప్పలేదు. పార్వతి పెంపకంలో వాడి కలవడిన సుగుణాలలో ఇది ఒకటి. పెద్దలు కసురుకున్నా వీలై నంతవరకు ఎదురు జవాబులు చెప్ప కూడదు. తప్పు తెలిసి ఉన్నా, వినయంగా స్వీకరించాలి.

బరువు ఫోటో—టి. కూర్మారావు (సీతానగరం)



“ఒరే రామం! నువ్వు నా స్వంత కొడుకువి కావు. అయినా, అంతకన్నా మిన్నగా పెంచాను. మా మీద లేశమాత్రం గౌరవం ఉన్నా ఇలాంటి తిరుగుళ్ళు తిరగకు. నీవు చేసే పనుల కెన్నెన్ని వంకలు పెట్టి ఎందరెందరు నన్ను చిత్రవధ చేస్తున్నారో నీకేమైనా అర్థమౌతోందా? కాంతమ్మగా రేమందో తెలుసా— చేతులు కాలిపోయిం తరవాత ఆకులు పట్టుకున్నా లాభం లేదంది. నీవు ఆ పిల్లకు మనసిచ్చి, ఆమెని నీవు గ్రహిస్తే మా గతేమిటి?”

“అమ్మా! క్షమించు. నే నింత దూరం ఆలోచించలేదు.”

“ఔనా! అందుకే చెపుతున్నాను. ఆ పిల్లతో స్నేహం తగ్గించి, నీ ఉద్యోగ మేదో చేసుకుపో. నీకు తగిన పిల్లను మేము గాలిస్తున్నాము. ఏదీ, ఈ వైశాఖం లోనే కోడలు పిల్లను తెచ్చుకోవాలని నాకు చాలా ముచ్చటగా ఉంది.” తృప్తిగా అంది పార్వతి. తన కొడుకు తన మాట జవదాటడన్న నిబ్బరం కలిగింది.

“అమ్మా!”

“ఏమిటిరా?”

“మరేం లేదు. నేను సరళను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను. ఇంతవరకు మా మనస్సులు ఒకరి నొకరు విప్పి చెప్పుకోకపోయినా, ఆమెకూడా నన్ను అతిగా ఆరాధిస్తున్నది. పైగా ఆమె ఏకాకి.”

పార్వతి నిశ్చేష్టురాలయింది. తను ఏది జరగకూడ దనుకుందో అదే జరిగింది. ఇరుగు పొరుగులవి అపోహలు, వాటిలో సత్యం లేశమాత్రం ఉండదన్న ఆమె విశ్వాసాని కో పెద్ద దెబ్బ తగిలింది. వాళ్ళు ఓర్వలేకనే తమలో కలతలు రేపడానికి చేస్తున్న ప్రయత్నాలని హృదయంలో పదిలపరుచుకున్న దృఢ అభిప్రాయం ఛిన్నాభిన్నమైంది.

ఇప్పుడు రామం రెక్కలు వచ్చిన పక్షి. గూడు అవసరం వాడికి లేదు. తన మానాన తను ఎగిరిపోగలడు. వాడిని నిరోధించడం తనకు సాధ్యమా? పెంచి పెద్ద చేసిన వారి పట్ల వాడు చూపవలసిన గౌరవం ఇదేనా?

“రామం! నువ్వేం చెపుతున్నావో ఆలోచించావా? అమ్మాయి తల్లిదండ్రులు ఎవరో, వారు మనతో వియ్యానికి తగుదురో తగరో, నీ వాళ్ళ అభిప్రాయాలు ఏమిటో నీ కక్కరలేక పోయాయా? ఇంత గుడ్డిగా ప్రేమించే అధికారం నీ కెవ రిచ్చారు? ఒకవేళ ఈ సంబంధం మాకు ఇష్టంలేని పక్షంలో నీ వెంత పరితపించవలసి ఉం టుందో ...ఇదేమో



-గుమ్మా ప్రసాదరావు

నీకు తెలియదా? నీకు జీవితం సినిమా అనుకున్నావా?"

రాముం మౌనమే వహించాడు.

"రాముం! నీకు తెలుసో తెలియదో ఆ పిల్ల తండ్రి స్వభావం, గుణం మంచివి కావు. దబ్బు లాంటి భార్యను, పసిపిల్లను కంటి పాపలా చూసుకోవడం మానేసి, ఎవత్తెతోనో లేచిపోయి వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళిపోయిన తరవాత ఆమె జీవితాన్ని ఎలా గడిపిందో, ఎలా పిల్లను పెంచిందో అనూహ్యం. అట్లాంటి వంశంలో పిల్లను చేసుకోవడం నాకు సమ్మతం కాదు. మీ నాన్నగారు తగిన సంబంధం చూస్తారు అంతవరకు నేను ఉంటా."

"ఆ పిల్ల తండ్రి చేసిన తప్పుకి పిల్లకా శిక్ష? కలిగిన వాళ్ళ ఇళ్ళలో ఊడిగం చేసి నీతిగానే పెంచింది ఆమె తల్లి. పాపం! కుమార్తె మంచి రోజులు చూసుకోకనే అదృష్టం నోచుకోక అల్పాయుష్షుతోనే కన్ను మూసింది. అలాంటి పిల్లకు నే న్యాయం చెయ్యలేను."

"అంతవరకూ వ్యవహారం నడిచిందన్నమాట!"

"ఇంతకంటే అబద్ధం లేదు. మా ఇద్దరి మధ్యా ఇంతవరకు ఏ అనుకోని సంఘటనా జరగలేదు. కాని, ఆమె మనస్ఫూర్తిగా నన్ను నమ్ముకొంది. నా కాను అభిప్రాయాలు నచ్చాయి. ఇక వాళ్ళ వంశ మర్యాదలా? నన్ను ఏం చూసి అడిగేవాళ్ళు వయస్సులో చేరదీశావు? నా తల్లెవరో, తండ్రెవరో, ఏ కుల సంబంధంగా పుట్టానో ... ఏమీ తెలుసుకోకుండానే పెంచావే—ఆమెను స్వీకరించే సంస్కారం నీలో లేదని ఎలా అనుకోను?"

"ఒరేయ్! నాకు నీతిపాఠాలు చెప్ప అవసరం లేదు. నీ మీద మా కెన్నో ఆశ లున్నాయి. ఈ రోజు నువ్వు నమ్ముకొన్న దానిని ఆమెను చేసుకుంటానంటే భావ్యం కాదు. నీకో చెల్లెలుందని, దాని భవిష్యత్తు నీ మీద ఆధారపడి ఉంటుందని మరువకు."

"అమ్మా! చెల్లెలికి నేనేమీ తక్కువ చెయ్యనే!"

"నీ కిలా చేస్తే అర్థమౌతుందో నాకు తెలియదు. కాని కట్నం లేకుండా నీకు పెళ్ళి చేస్తే దాని పెళ్ళి జరిగేదెట్లా? నీ కంటి ఉదారులే అందరూ అయితే అది వేరే సంగతి. కట్నకానుకల మీద నాకు ఆశ అని భావించకు. మీ నాన్న రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదిస్తున్నది మన ఖర్చుకే చాలడం లేదు. మిమ్మల్ని ఇంత చదువులు చదివించడానికి ఆయనెంత సతమతమైనారో నీకు తెలుసా? నీదేమైనా నాకత్తెక్కరు ఉద్యోగమా? నీ సంపాదన మీ భార్యా భర్తలకే చాటా చాటి. మరి దాని పెళ్ళి కష్టంగా జరగాలా? అది అయినింటి కోడలు కావాలా? పేటన్నిటికి ఉద్యోగస్థుడి నుంచి వస్తుందని? మన పెద్ద నిధి నిక్షేపాలు లేవే? పైగా మన్నా ఊరు పేరు లేని పిల్లను చేసుకుంటే దానికి మంచి సంబంధం రాదు కూడా."

"అమ్మా! చెల్లెలి పెళ్ళి తప్పటినుంచే ప్రయత్నాలా? దాని వయస్సెంత? నీ ఆశీర్వాదం ఫలితంగా నాకు ఇంతకంటే మంచి ఉద్యోగం, జీతం దొరక్క పోవు."

"రెక్కలు రాగానే ఎగిరిపోవడానికి మనమేమీ పక్షులము కాము. సంఘంలో కొద్దో గొప్పో పరువున్న వ్యక్తులం. సంఘం కట్టుబాట్లను ఎదిరించి మనలేము. సరళను చేసుకోవడం నా దృష్టిలో ఎంత మాత్రం మనకు లాభదాయకం కాదు!"

"అమ్మా! ఇదేనా నీ నిర్ణయం? ఒక్క మాట. ఒకవేళ సరళనే పెళ్ళి చేసుకోలేకపోతే బహుశా నే నసలు పెళ్ళే చేసుకోను."


పార్వతికి కోపం నసాళాని కెక్కింది.

"అనుకున్నంతా అయింది. అడ్డాల నాడే బిడ్డలు కాని గడ్డాలనాడా అని ఊరికే అనలేదు. రోడ్డు పక్క పెంటకుప్పలో కుళ్ళుతున్న నిన్ను చేర దీసి రెక్కలు ముక్కలు చేసుకొని నిస్వార్థంగా పెంచినందుకు తగిన శాస్తి చేశావు. వెనకటి కెవరో చెప్పినట్లు కనకపు సింహాసనాన శునకాన్ని కూర్చో పెడితే తోలు ముక్క కోసం పరుగెట్టిందట. అలా ఉంది నీ వ్యవహారం. ఒరేయ్! నాలో నిగ్రహాన్ని పరీక్షించకు. నీకు మేమే కావాలో, ఆ పిల్లే కావాలో నిర్ణయించుకో. ఆమె కావాలన్న మోజుంటే ఇక్కడినుంచి తక్షణం కదులు. నువ్వేమైనా నా కన్న కొడుకువా నా మాట మీద నిలబడడానికి!"

"ఇదేనా, అమ్మా, నీ నిర్ణయం?"

"నిర్ణయించుకోవలసింది నువ్వు—నేను కాదు."

"అమ్మా! ఇలాంటి విపత్కర స్థితి వస్తుందని అనుకోలేదు. నిన్ను నా కన్న తల్లి లాగానే భావిస్తున్నాను. నాలో సంస్కారం నశించి పోలేదు. రెక్కలు రాగానే ఎగిరిపోవాలని నేను కోరుకోవటం లేదు. నీ ఆదరణ, ఆత్మీయత నాకు మరువరానివి. మిమ్మల్ని విడిచి వెళ్ళడం నాకిష్టమైనది కాదు. కాని, నీ మీద గురి, నిశ్చయంతో నన్ను నమ్ముకున్న ఆ అనాథ పిల్లకు అన్యాయం ఎలా చెయ్యను? ఆమె కాని ఏ కలిగినింటి పిల్లో అయితే, నా కంత బాధ లేకపోను. నా మనస్సు నర్థం చేసుకో అమ్మా?"



పల్లెపట్టు    చిత్రం—ఎస్. ప్రసాద్‌రెడ్డి (ఇచ్ఛాపురం)

"తియ్యని మాటలతో నా మనస్సు మార్చాలనుకోవడం అవివేకం. ఎన్నెన్నో ఊహాసౌధాలు కట్టుకున్నాను నిన్ను చూస్తూ. ఇప్పు డవన్నీ పేకమేడల్లా కూలిపోవడం నేను భరించలేను. నీకు మా పట్ల విశ్వాసం ఏమైనా ఉంటే నే చెప్పినట్లు నడుచుకో. లేకుంటే ఒక్క క్షణం ఇక్కడ నిలబడకు. వెళ్ళు. తెలిసిందా?"

"అమ్మా!"

"ఏనాడైతే నా మాట జవదాటావో ఆ నాడే నీకు, నాకు సంబంధం వెళ్ళిపోయింది. కుక్కకుండే విశ్వాసం నీకు లేదు."

రామానికి తల్లి ఒక్కొక్క పలుకు ఒక్కొక్క శూలంలా గుచ్చుకుంది. తను చేసింది అసమంజసమైనది కాదే!

రాముంలో ప్రవహించే రక్తం పార్వతి రక్తం కాకపోవచ్చు. అయితే, ఆమె పెంపకంలో పెరిగిన వాడిలోనూ ఆమె కున్నంత పౌరుషమూ ఉంది. తల్లి మాటి మాటికీ నొప్పించేసరికి వాడి హృదయం గాయపడింది. "అమ్మా! నువ్వు నన్ను కనకపోయినా పెంచావన్న విశ్వాసం నాకు లేకపోలేదు. నేను నీ పట్ల అగౌరవంగా ప్రవర్తించిన క్షణం లేదు. అయినా, మాటి మాటికీ నా జన్మను జ్ఞప్తికి తెస్తూ నన్ను కుక్క కంటే హీనంగా పరిగణిస్తున్నావు. ఇంతకంటె చిటికెడు విషం నీ చేత్తో ఇస్తే తృప్తిగా తిని ప్రాణాలు విడిచేయగలనేమో! మనిషికి మనిషి ఆసరా కావాలి. నీ వో నాడు చేసిన పనే నేను నేడు చేద్దామనుకుంటే దాన్ని వ్యతిరేకించడం— నీది స్వార్థం కాదా? నేను రెక్కలొచ్చిన పక్షిని కాను, రెక్కలు తెగిన పక్షిని. వస్తా."

రాముం కట్టుబట్టలతో వీధిని పడ్డాడు.

రాముం వెళ్ళిపోవడంతో పార్వతి ఈ లోకంలోని కొచ్చింది. వాడు నిజంగా వెళ్ళిపోయాడా? ఇంటికి అపురూపంగా ఆకలితో వచ్చినవాడికి పట్టెడు మెతుకులు కూడా పెట్టకుండా కట్టుబట్టలతో తగిలేసిందా! ఆమె మాతృహృదయం తల్లడిల్లింది. కంటికి మంటికి ఏకధారగా విడుస్తూ అలానే కూర్చుంది ఎంతసేపో.

* * *

అగ్నిపర్వతం ఏదో ఓ నాడు బద్దలవక మానదు. చిన్న విషయమే చినికి చినికి గాలి వాన కావడం అసాధారణం కాదు. ఇట్లాంటి దుష్పరిణామం ఏదో నాడు సంభవిస్తుందని మొదటినుంచీ ఊహిస్తూనే వచ్చాడు విశ్వనాథరావు.

పెంటకుప్ప మీద ఎంగిలి విస్తరాకుల కోసం కుక్కలతో పోటీ దెబ్బలాడి విస్తరి దొరికించుకునే బాలుడు తన ఉన్నతిని కలలోనైనా ఊహించి ఉండడు. వాడి ధ్యేయం, జీవితాశయం ఒక్కటే —అదే రెండు పూటలా పట్టెడన్నం దొరుకుతే చాలన్నదే!

ఒక రోజు వాడు ఎంగిలి విస్తరాకు కోసం ఎగబడుతుంటే పార్వతి కంట

పడింది. వాడిని పిలిచింది. "పెంటకున్న విస్తరి తీసుకుంటే తాను వెంటుకుని అనుకుంటూ భయపడుతూనే వచ్చాడు.

"అబ్బాయి! అలా పెంటకున్న విస్తరి తీసుకుని ఎంగిలి మెతుకులు తింటావా? తప్పు కాదూ?" మందలించింది.

"ఆకలి." మూడే అక్షరాలు వచ్చాయి వాడి నోటినుంచి.

"బాబూ! ఆకలిగా ఉందా? నీకు ఎవరూ లేరా?"

"లేరు."

పార్వతి మాతృహృదయం తల్లడిల్లింది. అప్పట్లో లాంటి తెలుగు గడ్డ మీద ముక్కు పచ్చలారని పసిబాలుడికి ఎన్నెన్ని కష్టాలు కలుగుతున్నాయో? ముగ్గురానే వాడిలోయిన వాడి జీవితం పట్ల అనుకుని చెప్పలేని వ్యథ కలిగింది. చిన్నతనంనుంచి ఉన్నత భావాలు, విధి నంబిచలు పట్ల ప్రేమానురాగాలు కల ఆమె ఆ బాబుణ్ణి స్వీకరించింది.

పార్వతి కప్పుడు నిండా ఇరవై ఏళ్ళ లేవు. పెళ్ళై రెండు సంవత్సరాలు కాలేదు.

"ఏమండీ! పాపం వీడికి తల్లి తండ్రి లేరుట. ఆకలితో అలమటించి పోతున్నాడు. మనం పెంచుదాం" అనది విశ్వనాథరావుతో.

పనిక్కరవాడి అవసరం ఉన్న విశ్వనాథరా వందుకు అభ్యంతరం చెప్పలేదు.

వాడిని సాకే విధానం విశ్వనాథరావుకే కాదు, ఇరుగు పొరుగుల వాళ్ళకుకూడా విచిత్రంగా తోచింది. పార్వతి ఆప్యాయంగా వాడికి నచ్చినవి వండి, కన్నతల్లిలా తినిపించేది. రాత్రి వాడి పక్కలో పడుకుండి నీతిబోధకమైన కథలు,కబుర్లు చెబుతూ నిద్ర పుచ్చేది. వాడికి చదువుపట్ల ఆసక్తి కలిగించి, మాస్టర్ని పెట్టి చదువు చెప్పించసాగింది.

"వాడు నీ కేమైనా అమ్మాడా, చుట్టమా? కన్న కొడుకులా సాకుతున్నావు. ఏ తినుబడి బతికేవాడు—వాడి జాతేమిటో, వంశమేమిటో? రేపు నీ ఇంట్లో ఉన్నదంతా ఊడ్చుకు పోతే తరవాత విచారించి ఫలితం ఉండదు." ఒకరిద్దరు పార్వతి కిదే ధోరణిలో హెచ్చరిక చేశారు. విశ్వనాథరావుకుకూడా ఇలాంటి అభిప్రాయాలు కలక్క పోలేదు.

"పార్వతీ! వాణ్ణి అధికంగా ప్రేమిస్తున్నావు. రేపు వా డేదైనా నైచ్యానికి పాలుబడితే విచారించ వలసి వస్తుంది. రెండు పూటలా పట్టెడు మెతుకులు పెట్టడంలో నా కభ్యంతరం లేదు కాని, వాడిని అలా అక్కున చేర్చుకోవడం నా కసంతర్పంగా ఉంది."

"బాగుందండీ మీ ఆలోచన. వాడికి కావలసింది తిండే కాదు. తల్లి ప్రేమ. పాపం ఎక్కడ పుట్టాడో,ఏమో! తల్లి తండ్రికూడా తెలియకుండా పెరిగాడు."

"భగవంతుడికి వాడి పట్ల కనికరం లేకపోవచ్చు. అయితే, అనాథల్ని తీసుకు వచ్చి మన మెలా పెంచగలం? వాడికి చదువు సంధ్యలు చెప్పించడం మనకు సాధ్యమా? రేపో మాపో వాడు హఠాత్తుగా మనల్ని వదిలేసి వాడి దారిని వాడు పోతే నీవు భరించగలవా?"

"సంస్కారం జన్మతో కాదు, పెంచడంతో అలవడుతుంది. రాముడు నా పెంపకంలో ఉన్నతుడౌతాడు. ఆ ఆశ నా కుంది. రెండు పూటలా ఇంత తిండి పడేస్తే కుక్కైనా విశ్వాసంగా పడి ఉంటుంది. మరి మానవుడికి ఉండదా? వాడు మనల్ని విడిచి ఎందుకు వెళ్ళి పోతాడు?"

అని ఆత్మ విశ్వాసం పట్ల నమ్మకం ఉన్నా, విశ్వనాథరావు ఈ ఆప్యాయత ఎల్లకాలం ఎలా నిలుస్తుందో అన్న సంశయానికి లోనయ్యాడు.

పార్వతి రామున్ని కన్నకొడుకులా చూడటం, వాడి అలనా పాలనా నెత్తిని వేసుకోవడం ఆమె కామె తల్లిదండ్రులు అనుకూలంగా నచ్చచెప్పేరు.

"పెండ్లై నిండా రెండు సంవత్సరాలు కాలేదు నీకు అప్పుడే విరక్తి పుట్టిందా! ఏం లోపం ఏర్పడుతుంది. పైగా రేపు నీ కో బిడ్డ పుడితే వీణ్ణి ఇంత ఆప్యాయంగా చూడగలవా? అప్పుడు నీవెంత బుద్ధిపోతావు? తల్లీ! నాలాగా నీవు తెలిసీ పోతావు జాగ్రత్త, అనుబంధాలు పెంచుకోకు." తల్లి సలహా ఇచ్చింది.

పార్వతి నిర్ణయం మారలేదు. వాడిని తీర్చి దిద్దడం కోసం తను ఏమైనా త్యాగం చేస్తుంది. కాని, ఓ దీపం సొంతం లేక ఆరిపోవడానికి ఇష్టపడలేదు. తొలి సంతానంగా వాడినే భావించింది. మరో ఆరు నెలలకు పద్మ పుట్టింది. అంతే. లోకం అనేవాళ్ళు అనుకుంటున్నట్లు కాని కొడుకు పుడితే వీడి నింత ప్రేమానురాగాలతో చూడగలనో, లేనో అన్న భావం మరి చిగుళ్లు తొడుగకుండా అపరేషను చేయించుకుంది.

దీనితో విశ్వనాథరావుకి మతి పోయింది. ఇరుగు పొరుగు ఆశ్చర్యంతో ముక్కుమీద వేలేసుకున్నారు.

పార్వతి పెంపకంలో రాముడు మనిషిగా తయారవుతున్నాడు. తల్లిదండ్రుల పట్ల